క్లుప్తంగా

హ్యూమన్ రైట్స్ అధ్యక్షురాలికి సన్మానం



రుక్మిణిని సన్మానిస్తున్న దృశ్యం

కల్లూరు: ఏపీలోని కాకినాడలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవంలో హ్యూమన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షురాలు, కల్లూరుకు చెందిన ఎనుముల రుక్మిణిని సన్మానించారు. ఆమెను కాకినాడ జడ్జి పి.సూర్యనారాయణ, డీఎస్పీ కృష్ణవిక్రమ్, నిర్వాహకులు బొడ్డపాటి దాసు తదితరులు సన్మానించగా... రుక్మిణి మాట్లాడుతూ చట్టాలు, మానవ హక్కులపై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పిస్తానని తెలిపారు.

ఏసీ బస్సుల్లో చార్జీపై రాయితీ



మాట్లాడుతున్న రాజ్యలక్ష్మి

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి నుంచి హైద్రాబాద్‌కు రాజధాని ఏసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు బేసిక్ చార్జీపై 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్టు సత్తుపల్లి డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె మాట్లాడుతూ.. ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ ఆదేశాల మేరకు ఈ నెల 31 వరకు ఈ ప్రత్యేక ఆఫర్ ఉంటుందన్నారు. సత్తుపల్లి డిపో పరిధిలోని ప్రయాణికులకు ఈ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

'శాతవాహన'కు హాల్టింగ్ కల్పించాలని వినతి

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలుకు హాల్టింగ్ కల్పించాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నూతక్కి నర్సింహారావులు కలిసి వినతిపత్రం అందజేశారు. హాల్టింగ్ కల్పిస్తే చారిత్రక నేపథ్యం ఉన్న జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంకు వచ్చే భక్తులు, పర్యాటకులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ మేరకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పందిస్తూ కేంద్ర రైల్వే శాఖమంత్రి అశ్విన్ వైష్ణవ్‌కు లేఖ రాశారు. తక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా లేఖలో కోరినట్లు వారు తెలిపారు.

మండల ప్రత్యేకాధికారిగా నారాయణ



ఎర్రుపాలెం: ఎర్రుపాలెం మండల ప్రత్యేకాధికారిగా కేవీ నారాయణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారిగా వ్యవహరిస్తున్నారు. మండల ప్రత్యేకాధికారిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్థానిక అధికారుల సహకారంతో మండలాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

ఎమ్మార్పీఎస్ కమిటీల ఎన్నిక



రాజా

మధిర: ఎమ్మార్పీఎస్ మధిర మండల అధ్యక్షుడిగా మేకల రాజా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం పట్టణంలో సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ జాతీయ నాయకులు ఏపూరి వెంకటేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఇసినేపల్లి అశోక్ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ సాధ్యమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. మాదిగలు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తూరుగంటి అంజయ్య , కూరపాటి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఏన్కూరు మండల అధ్యక్షుడిగా నరేష్..



నరేష్

ఏన్కూరు: ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా యంగల నరేష్ ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ మండల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నరేష్, ఉపాధ్యక్షుడిగా మంతెన ప్రవీణ్, భాగం బెంజిమన్, గొడ్ల రామకృష్ణ, చిన్నపల్లి నరసింహారావు ఎన్నుకున్నారు. ఏపూరి వెంకటేశ్వరావు మాదిగ, తురుగంటి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కష్టాల వలయంలో మార్కెట్

మధిర ఏఎంసీకి ఏడాదిగా లేని పాలకవర్గం

- ఎదురుచూపుల్లో ఆశావహులు
- శిథిలావస్థలో మార్కెట్ కమిటీ భవనం, గోడౌన్లు
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- 12 మందికి.. ముగ్గురే రెగ్యులర్ ఉద్యోగులు



మధిర వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

మధిర: మధిర నియోజకవర్గంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల నియామకం రోజురోజుకు జాప్యం జరుగుతోంది. ఏడాది కాలంగా పాలకవర్గాన్ని నియమించకపోవడంతో చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందోనని అక్కడి ప్రజలు ఎదురుచూస్తున్నారు. కానీ ఈ సారి మధిర ఏఎంసీ చైర్మన్ పదవి బీసీ కేటగిరీకి ఉండడంతో ఆశావహుల్లో ఎదురుచూపులు తప్పడం లేదు. ఇదిలా ఉండగా మార్కెట్ కమిటీ భవనంతో పాటు పలు గోడౌన్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఒకవైపు మార్కెట్ కమిటీ పాలకవర్గం భర్తీ కాకపోవడం, మరోవైపు ఖాళీ పోస్టులు భర్తీకి నోచుకోకపోవడం, గోడౌన్లు, భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో.. మధిర మార్కెట్ కమిటీ పరిస్థితి ఆదాయం ఉన్నా అభివృద్ధి సున్నా అనే విధంగా ఉంది.

ఆదాయం ఉనా.. అభివృద్ధి సున్నా..

మధిర వ్యవసాయ మార్కెట్ మధిర, ఎర్రుపాలెం, బోనకల్ మండలాలకు విస్తరించి ఉంటుంది. ఈ మండలాల పరిధిలో రైతుల పండించిన పంట ఉత్పత్తులను మార్కెట్ ద్వారా విక్రయిస్తున్నారు. పత్తి, మిర్చి, సుబాబుల్, ధాన్యం, పెసర, కంది, మొక్కజొన్న తదితర అన్ని రకాల వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ ఫీజు ఉంటుంది. తద్వారా మార్కెట్ కమిటీకి ఆదాయం వస్తుంది. 2023–24 సంవత్సరానికి సంబంధించి మార్కెట్ వార్షికాదాయం టార్గెట్ రూ. 4.34 కోట్లు కాగా.. లక్ష్యాన్ని అధిగమించి రూ. 4.68 కోట్లు సాధించింది. అదేవిధంగా 2024–2025 సంవత్సరానికి టార్గెట్ రూ. 4.75 కోట్లు కాగా నవంబర్ నెల వరకు రూ.3 కోట్లు ఆదాయం వచ్చింది. ఇంకా నాలుగు నెలల గడువు ఉండగా ఈ ఏడాది కూడా 100శాతం లక్ష్యాన్ని అధిగమించే అవకాశం ఉంది.

భర్తీకి నోచుకోని పోస్టులు

మధిర వ్యవసాయ మార్కెట్‌లో అనేక సంవత్సరాలుగా ఖాళీ పోస్టుల భర్తీకి నోచుకోవడం లేదు. మధిర మార్కెట్ స్పెషల్ గ్రేడ్ కావడంతో 12 మంది సిబ్బంది ఉండాలి. కానీ ముగ్గురే ఉన్నారు. మార్కెట్ కమిటీ కార్యదర్శి, సూపర్‌వైజర్, క్లర్క్ మాత్రమే ఉన్నారు. ఇంకా గ్రేడ్–3 సెక్రటరీ, టైపిస్ట్, అసిస్టెంట్ మార్కెట్ సూపర్‌వైజర్, ఇద్దరు జూనియర్ మార్కెట్ సూపర్‌వైజర్లు, అటెండర్ పోస్టు, 3 వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

రైతులకు అందుబాటులో సేవలు..

పాలకవర్గాన్ని నియమిస్తే రైతులకు అందుబాటులో ఉంటూ విస్తృత సేవలు అందించే అవకాశం ఉంది. ముఖ్యంగా పత్తి చేతికి వచ్చి సీసీఐలో రైతులు అమ్ముకుంటున్నారు. తేమ శాతం పేరుతో పత్తికి క్వింటాకు 3 నుంచి 5 కేజీల వరకు తరుగు తీస్తున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కొద్ది రోజుల్లో మిర్చి పంట కూడా చేతికి వచ్చే అవకాశం ఉంది.

చైర్మన్‌గా బండారు నరసింహారావు?



ఖాళీగా ఉన్న చైర్మన్ కుర్చీ

ఈ సారి ఏఎంసీ చైర్మన్‌గా మామునూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బండారు నరసింహారావు పేరును ఖరారు చేసే అవకాశం ఉందని సమాచారం. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో రెండు దఫాలు ఈ పదవిని మధిర మండలానికి చెందిన నాయకులకు ఇచ్చారు. ప్రస్తుత పదవి ఎర్రుపాలెం మండలానికి కేటాయించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆలోచన చేస్తున్నట్టు తెలిసింది. మధిర నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా భట్టి విక్రమార్క పోటీ చేసిన 4 ఎన్నికల్లో కూడా ఆ మండలం నుంచి భారీ మెజార్టీ రావడం, ఎన్నికలకు ముందు అక్కడ నాయకులకు మార్కెట్ కమిటీ పదవిని ఎర్రుపాలెం మండలానికి కేటాయిస్తామని హామీ ఇవ్వగా ఇప్పుడు ఆ హామీని నిలబెట్టుకునే దిశగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

అవినీతిపై విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న సుజలరాణి

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి మున్సిపాలిటీలో జరిగిన అవినీతిపై ప్రభుత్వం విచారణ చేయించాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ తోట సుజలరాణి, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్‌బాబు, కౌన్సిలర్లు కోరారు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడుతూ... సిమెంట్ బల్లలను రూ.2,600తో కొనుగోలు చేసి రూ.6,300 చొప్పున బిల్లులు కాజేశారని, లవ్ సత్తుపల్లి, అంబేడ్కర్ విగ్రహం, వందడుగుల జాతీయ జెండా ఏర్పాటులోనూ అవినీతి జరిగిందని విమర్శించారు. ఇక మున్సిపాలిటీ షాపుల్లో టెండర్లు లేకుండా రెన్యూవల్ చేసే క్రమాన రూ.లక్షలు చేతులు మారాయని విమర్శించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నారావు, కౌన్సిలర్లు దూదిపాల రాంబాబు, కంటే నాగలక్ష్మి, మందపాటి పద్మజ్యోతి, ఎస్‌కే.నాగుల్‌మీరా, సొసైటీ అధ్యక్షుడు చల్లగుండ్ల కృష్ణయ్య, సుబ్బారావు, ఎండీ.కమల్‌పాషా, గఫార్ ఖాన్, గోలి శ్రీనివాసరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, గణేష్, సారధిరెడ్డి, చెన్నారావు పాల్గొన్నారు.

గజాల చొప్పన పరిహారమివ్వాలి

సత్తుపల్లి: కొత్తూరు–రేజర్ల ఆర్‌అండ్‌బీ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న వారికి గజాల చొప్పున పరిహారం ఇవ్వాలని ఆర్డీఓ రాజేంద్రగౌడ్, జేవీఎఆర్ ఓసీ పీఓ ప్రహ్లాద్‌ను పలువురు కోరారు. ఈ సందర్భంగా అధికారులతో కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, భూనిర్వాసితులు మంగళవారం చర్చించారు. సుమారు 20 మంది ఇళ్ల స్థలాలు కోల్పోతుండగా, మార్కెట్ విలువ కుంటకు రూ.15 లక్షలు ఉంటే సింగరేణి రూ.65 వేలు చెల్లిస్తోందని తెలిపారు. కాగా, సమస్యను కలెక్టర్, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్తానని దయానంద్ తెలిపారు. కొప్పుల నరేందర్‌రెడ్డి, భూ నిర్వాసితులు పాల్గొన్నారు.

సీపీఎంలో చేరికలు

ఎర్రుపాలెం: మండలంలోని రామాపురం గ్రామంలో మంగళవారం వివిధ పార్టీల నాయకులు సీపీఎంలో చేరారు. ఈ మేరకు పార్టీలోకి చేరినవారికి పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య, మండల అధ్యక్షులు మద్దాల ప్రభాకర్‌లు కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం కొమ్మూరి కృష్ణ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అప్పారావు, వెంకటరామయ్య, గురవయ్య, షేక్ మస్తాన్, కొండెపాటి శివయ్య ఉన్నారు.

సన్మానం



గోపాలరావును సన్మానిస్తున్న నాయకులు

చింతకాని: సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శిగా ఎన్నికైన మడుపల్లి గోపాలరావును పార్టీ మండలకేంద్రంలోని కార్యాలయంలో మంగళవారం సన్మానించారు. దేశబోయిన ఉపేందర్, సమద్ పాషా, మహేష్ కుమార్ ఉన్నారు.

ముగిసిన డ్యాన్స్ పోటీలు




బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి స్టెప్ అప్ డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాల స్థాయి తెలుగు రాష్ట్రాల డ్యాన్స్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీలకు వంద ఎంట్రీలు రాగా వెస్ట్రన్, జానపద, క్లాసికల్ విభాగాల్లో జూనియర్, సీనియర్ పోటీలలో ప్రథమ బహుమతులు ఫ్రూటీ జశ్విత, తనుశ్రీ, జశ్వత గ్రూప్ బహుమతులు గెలుచుకున్నాయి. ఈ కార్యక్రమంలో డ్యాన్స్ మాస్టర్ కిన్నెర మణి, గాదె చెన్నారావు, కమల్‌పాషా, ఖాజా శ్రీనివాసరావు, సారథిరెడ్డి, మురళీ, థామస్, రంగపురి వెంకటేశ్వరరావు, రాధాకృష్ణ, మనోజ్, శంకర్ పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి

వేంసూరు: మండలంలోని ఎర్రగుంటపాడు రెవెన్యూ పరిధిలో ఉన్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం కల్లూరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ రాంజేంద్రగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎర్రగుంటపాడు 756 సర్వే నంబర్‌ను సర్వే చేసి పేదలకు పంపిణీ చేయాలని, అమ్మపాలెం రెవెన్యూ పరిధిలో పేదలకు చెందిన భూములను కొందరు ఆక్రమించారని, ఆభూములను సర్వే చేసి పేదలకు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె.రంజాన్‌బీ, వెంకటేశ్వరరావు, అంజమ్మ, వెంకటమ్మ, సరోజిని, రంగారావు, సీత, శ్రీను, దేవి పాల్గొన్నారు.

నేడు మహా చండీయాగం



హోమగుండాలకు రంగులు అద్దుతున్న భక్తులు

తల్లాడ: తల్లాడ మండలం నారాయణపురంలో మహా చండీయాగం నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్థానిక భక్తుల సహకారంతో బుధవారం యాగాన్ని నిర్వహించనున్నారు. ఈమేరకు 64 హోమ గుండాలు సిద్ధం చేయగా 201 మంది దంపతులు పాల్గొననున్నారు. యాగాన్ని కంచెల సతీష్ శర్మ ఆధ్వర్యాన పెనుగంచిప్రోలుకు చెందిన రాజోలు భానురవికిరణ్‌శర్మ నిర్వహిస్తారు. ఇప్పటికే హోమగుండాలు సిద్ధం చేయగా భక్తులు ముగ్గులు వేయడంతో పాటు పూలమాలలతో అలంకరించారు.

సేవలు అభినందనీయం..



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దయానంద్

సత్తుపల్లిరూరల్: నిరుపేదలకు యువసేవా సమితి అందజేస్తున్న సేవలు అభినందనీయమని ఆషా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు డాక్టర్ మట్టా దయానంద్, ఎన్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడే అలవాల కరుణాకర్ అన్నారు. మంగళవారం సత్తుపల్లిలో సేవాసమితి ఆధ్వర్యాన యాచకులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమితి నిర్వాహకులు జె.రాజు, నాయకులు గాదె చెన్నారావు, దోమ ఆనంద్ బాబు, కమల్‌పాషా, కేశ్వర్‌రెడ్డి, దుర్గాప్రసాద్, మురళీ, ప్రదీప్, చరణ్, సంతోష్ పాల్గొన్నారు.

మొక్కలకు క్యూఆర్ కోడ్‌లు

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ బోటనీ వారి ఆధ్వర్యంలో మొక్కలకు క్యూఆర్ కోడ్‌లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ డి.శ్రీవాణి మాట్లాడుతూ.. కోడ్‌ను స్కాన్ చేస్తే మొక్క శాస్త్రీయ నామం, ఉపయోగాలు వంటి విషయాలు తెలుసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నవ్య, కో ఆర్డినేటర్లు కేపీ.ఐశ్వర్య, బోటనీ హెచ్ఓడీ ఏ.దీప్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కల్లూరురూరల్: మండలంలోని బత్తులపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మండలంలోని బత్తుపల్లి, కొర్లగూడెం, రామకృష్ణాపురం, లక్ష్మీపురం, సాంబయ్యబంజరు గ్రామాలకు నిలిపివేయనున్నట్టు వినియోగదారులు సహకరించాలని కోరారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం యూటీఎఫ్ జిల్లా మహాసభల పోస్టర్లను మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నంద్రు వెంకటేశ్వరరావు, అనుమోలు కోటేశ్వరరావులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ నెల 14,15 తేదీల్లో సత్తుపల్లిలో నిర్వహించనున్న మహాసభకు పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు తరలిరావాలని కోరారు. మండల ఉపాధ్యక్షులు కంచర్ల శ్రీనివాసరావు, కోశాధికారి సైదారావు, సభ్యులు వెంకటకృష్ణ, నాగమణి, నాగేశ్వరరావు, రవికుమార్, సురేష్, సుబ్బ రామరాజు, జీవన్, నాగరాజు, సత్యనారాయణ, పుల్లారావు, శంకర్, అజీమ్ ఉన్నారు.

కారేపల్లి: ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే లక్ష్యంగా టీఎస్‌యూటీఎఫ్ పోరాటాలు చేస్తుందని మండల అధ్యక్ష కార్యదర్శులు కేవీ.కృష్ణారావు, బానోత్ మంగీలాల్ అన్నారు. మండలంలోని మాణిక్యారం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన యూటీఎఫ్ సమావేశంలో సత్తుపల్లిలో జరగనున్న జిల్లా సభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈర్య, నాగేశ్వరరావు, కేఎల్ఎస్ చార్యులు, రమేష్, మురళీ పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన ఎమ్మెల్యే రాగమయి



మంత్రి పొంగులేటితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సత్తుపల్లి: రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఎమ్మెల్యే మట్టా రాగమయి మంగళవారం హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్‌లో కలిసి నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇళ్లు ఎక్కువగా కేటాయించాలని కోరారు. ఇళ్ల సర్వే యాప్, నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. అదే విధంగా ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసి నూతనంగా ఆర్‌అండ్‌బీ రహదారులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. సీడీఎంఏ, మున్సిపల్ కమిషనర్ శ్రీదేవిని కలిసి సత్తుపల్లి మున్సిపాల్టీలో అదనంగా 30 మంది పారిశుద్ధ్య కార్మికులను ఇవ్వాలని, మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి, సమస్యలపై వివరించారు.

ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే



పేరువంచ గ్రామంలో ఇళ్ల సర్వే..

కల్లూరురూరల్: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు సంబంధించి క్షేత్ర స్థాయిలో ముమ్మరంగా సర్వే నిర్వహించారు. ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్ ద్వారా లబ్ధిదారుల వివరాలు నమోదు చేస్తున్నారు. కల్లూరు ఎంపీఓ సురేష్‌బాబు, ఎర్రబంజరు, నారాయణపురం గ్రామ పంచాయతీలో పరిశీలించారు. లబ్ధిదారులకు సంబంధించిన వివరాలు జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు.

మోటార్లకు కెపాసిటర్లు అమర్చాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈ అనూష

ఎర్రుపాలెం: విద్యుత్ మోటార్లకు రైతులు తప్పనిసరిగా కెపాసిటర్లు అమర్చాలని విద్యుత్ ఏఈ జి.అనూష అన్నారు. మండలంలోని పెగ్గళ్లపాడు గ్రామంలో మంగళవారం విద్యుత్ శాఖ అధికారులు పొలంబాట నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు చోటు చేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతాంగానికి వివరించారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ చిన్న పుల్లయ్య, లైన్‌మెన్లు నారాయణరెడ్డి, వంశీ, ఆనంద్‌రావు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

చింతకాని: మండల పరిధిలోని కొదుమూరు గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఆర్‌డీఓ ఆర్. సన్యాసయ్య మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, రైతులకు తగిన సౌకర్యాలను కల్పించాలన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం

తల్లాడ: కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణా తల్లి విగ్రహాన్ని మార్చడాన్ని నిరసిస్తూ మండలకేంద్రంలోని రింగ్‌సెంటర్‌లో మంగళవారం తెలంగాణా తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనువాసరావు, బీఆర్ఎస్ మండలకార్యదర్శి దుగ్గిదేవర వెంకట్‌లాల్, శ్రీనివాసరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఆశీర్వాదం, జీవీఆర్, శ్రీను, గుండ్ల వెంకటి, రంగా పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు

చింతకాని: దాడి ఘటనలో ముగ్గురిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. ఎస్సై నాగుల్‌మీరా తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నేరడ గ్రామానికి చెందిన శనగల శంకర్‌తో ఓ ఫంక్షన్ వద్ద జరిగిన గొడవను దృష్టిలో ఉంచుకుని అదే గ్రామానికి చెందిన మచ్చల వెంకన్న, పేతురు, వనం పుల్లారావు ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో అడ్డుగా వచ్చిన శంకర్ కుమారుడు రాజేష్‌ను కొట్టడంతో అతని తలకు గాయమైంది. దీంతో శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకన్న, పేతురు, పుల్లారావులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఆశావర్కర్ల అరెస్ట్



పోలీస్ స్టేషన్‌లో ఆశావర్కర్లు

కారేపల్లి: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్తున్న ఆశావర్కర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరరావు ఆశాలను కలిసి సంఘీభావం తెలిపి మాట్లాడారు.. ఆశా వర్కర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు వాంకుడోత్ కమల, జంగ కళ్యాణి, భూక్యా సుజాత, మేదర్ కుమారి, ఆదేర్ల దేవకరణ, అరుణ, లక్ష్మీ, సంధ్య, పద్మ, మంగ, దేవీ, లలిత, బుచ్చమ్మ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలి

సత్తుపల్లిరూరల్: సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచాలని ప్రోగ్రెసివ్ సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి అమర్లపూడి శరత్ అన్నారు. ఈ మేరకు మంగళవారం కరపత్రాలతో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం సింగరేణి అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కట్టా ప్రసాద్, సురేష్, కన్నయ్య పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం..



కొణిజర్ల: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అధికారులు

కొణిజర్ల: కొణిజర్ల మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు మంగళవారం మండలంలోని తనికెళ్లలో ప్రారంభమయ్యాయి. పురుషుల క్రీడలు తనికెళ్ల సమీపంలోని తెలంగాణ మైనార్టీ బాలుర సంక్షేమ గురుకుల పాఠశాలలో, మహిళల క్రీడలు తనికెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. పోటీలను ఎంపీడీఓ రోజారాణి, తహసీల్దార్ తఫజల్ హుస్సేన్‌లు ప్రారంభించి మాట్లాడుతూ.. క్రీడలతో స్నేహ భావం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రాజేశ్వరీ, ఎంఈఓ అబ్రహం, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ మండలస్థాయి క్రీడలు ప్రారంభించారు. క్రీడాకారులను తహసీల్దార్ ఉషాశారద, ఎంపీడీఓ సురేందర్, ఎస్సై వెంకటేష్, ఎంఈఓ బి.మురళీమోహన్‌రావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి పరిచయం చేసుకున్నారు. తొలిరోజు నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. భీమవరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు యరమల పూర్ణచంద్రారెడ్డి కీడ్రాకారులకు బహుమతులు, భోజన వసతి ఏర్పాటు చేశారు. ఎంపీఈఓ గంధం శ్రీలక్ష్మి, ఎస్‌జేకేఎం కళాశాల డైరెక్టర్ దండెం సత్యనారాయణరెడ్డి, పీడీ మారాబత్తుల జమలయ్య, పీఈటీలు సత్యనారాయణరెడ్డి, కోనా రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎర్రుపాలెం: బహుమతులు అందజేస్తున్న ఎంపీడీఓ సురేందర్

ఏన్కూరు: స్థానిక గురుకుల విద్యాలయంలో సీఎం కప్ క్రీడా పోటీలను ఎంపీడీఓ సకినాల రమేష్ ప్రారంభించారు. ఎస్సై రఫీ కబడ్డీ ఆడి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. తహసీల్దార్ సిహెచ్ శేషగిరిరావు, ఎంఈఓ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ తుడి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

12, 13వ తేదీల్లో...

వైరా: ఈ నెల 12, 13 తేదీలలో వైరా మున్సిపాలిటీ పరిధిలో సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ చింతా వేణు తెలిపారు. 12న బాలురకు, 13న బాలికలకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వైరా ప్రభుత్వ బాలుర పాఠశాలలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ విభాగాలలో పోటీలు జరుగుతాయని తెలిపారు.



ఏన్కూరు: కబడ్డీ ఆడుతున్న ఎస్సై రఫీ